# తెలుగు రచయిత్రికీ జై

పెళ్ళి పందిరిలో సన్నాయి మ్రోగుతుంది.

మామిడాకుల తోరణాల మధ్య, కొబ్బరాకుల కల్యాణమండపం. ముస్తాబు ముగించుకుని నూతన వధూవరుల కోసం నిరీక్షిస్తూన్నట్లుగా వుంది. షామియానాలో పిల్లలుచేరి అల్లరి చేస్తూన్నారు.

పిలక తాతయ్య అటుగావస్తూ 'అల్లరి చెయ్యకండర్రా' అంటూ చేతిలోని గొడుగుతో బెదిరించాడు. ఒక్క క్షణం 'గప్‌చిప్' అయినా మరు క్షణంలో "తాత పిలక' రాతి పలక" అంటూ ఎక్కిరించి పారిపోయారు. మన లాయన్ని యిలా అంటేచాలు వెర్రికోపం వచ్చేస్తుంది. అంతే వాళ్ళ వెంట పడ్డాడు. గదులూ సావిడీ దాటి వీధినపడ్డారుపిల్లలు. వాళ్ళని అనుసరించాడు పిలక తాతయ్య.

పెళ్ళి కూతురు మేనత్త అయిన మీనాక్షి లడ్డూల డబ్బా అటక మీదికి యెక్కించటానికి సాయం రమ్మని మేనల్లుడు చిట్టిబాబు కోసం వెతుక్కుంటూ అటు వచ్చింది. 'ఈ మొద్దు వెధవ యెక్కడా కనిపించదే'అనుకుని షామియానాలోని కల్యాణ మండపం ఓ సారి తదేకంగాచూసి "అబ్బ!

యెన్నాళ్ళకి యీ శుభ ఘడియ వచ్చింది" అనుకుంటూ అక్కడే నిల్చి పోయింది. ఆవిడకి జరిగిపోయిన యెన్నో విషయాలు గుర్తుకి వచ్చాయి.

ఇరవై యేళ్ళప్పుడే భర్తని పోగొట్టుకుని పుట్టిల్లుచేరిన మీనాక్షమ్మకి అన్న వదినల ఆదరణ లభించింది. అన్నగారికి ముగ్గురు ఆడపిల్లలూ ఒక అబ్బాయి. చిట్టిబాబు ఆఖరువాడు కావటంవల్ల యీ యేడే కాలేజీ చదువుకి వచ్చాడు. యింక మూడో అమ్మాయి సుమలత హైస్కూలు చదువు ముగించింది.

'కాలేజీలో చేరతాను' అంది కానీ తండ్రి శక్తి తెల్సి "వద్దులే ప్రైవేటుగా చదువుకుంటాను" అంది సుమలత. అంతే ప్రయత్నం ప్రారంభించింది. ఇంటర్‌కి కట్టింది. స్వయంగా చదువుకుంటూ తెలియనివి చిట్టిబాబు కాలేజీలో లెక్చరర్ అయిన మధుసూధన్‌ని అప్పు డప్పుడూ అడిగి తెల్సుకుంటూ అలాగే ఇంటర్ పాసై బి. ఏ. లోకి వచ్చింది. సుమలత అందగత్తే కాకున్నా అనాకారి మాత్రం కాదు. చదువులో ఆటల్లో ఫస్టువుండేది యెప్పుడూ.యీ అమ్మాయి అంటే మీనాక్షమ్మకి అయిదోప్రాణం.యెప్పుడూ చూసినా వుత్సాహం వురకలు వేస్తున్నట్లుండె సుమలత యీ మధ్య మరో ప్రత్యేకత కూడా సంపాదించింది.

ఎప్పుడు రాసిందో యెలా రాసిందో యెన్నిసార్లు ఆ కథల కవర్లు తిరిగి వచ్చాయో ఒక్క పోస్ట్‌మేన్ రంగయ్యకి తప్ప మరెవరికీ తెలియవు. ఒకరోజు సుమలత కథ ఓ వారపత్రికలో అచ్చు అయి పోస్ట్‌మేన్ రంగయ్య చేతినించి సుమలత తండ్రి మూర్తిగారి చేతిలోకి వెళ్ళింది. ఆయన పత్రికని ఆశ్చర్యంగా యిటు అటూ త్రిప్పిచూసి ముఖం చిట్లించి.

"అమ్మాయ్ ! మీనాక్షీ ! యేదీ నీ మేనకోడలూ !" అన్న గర్జింపుకి ఇంట్లో అందరూ హడిలిపోయారు. సుమలత తల్లి సుబ్బమ్మ వణికే కంఠంతో భర్త దగ్గరకివచ్చి "యేమైందండీ" అంది.

"నీ కూతురేది ?" కర్కశంగా అడిగాడు మూర్తిగారు.

"అసలేమైందీ ! ఏ పోకిరీ వెధవన్నా ప్రేమలేఖ వ్రాశాడా !" భయంగా అంది.

మూర్తిగారి కళ్ళజోడు ముక్కుమీదకి జారిపోయింది.

"ఏమంటున్నావ్ ! మనమ్మాయికి ప్రేమలేఖ రాశారా ! యెవరా గాడిద ?" ఆవేశంగా లేచారాయన. సుబ్బమ్మ ఖంగారు మరీ ఎక్కువైంది.

"అయ్యో నేనన్నానా ! మీరంటున్నారా ! అని అడిగా అంతే ! మరి మీ కంత కోపం యెందుకూ అంట ?"

"కోపం కోపం అంటావుగానీ ఆ పాపిష్టిది ఏం చేసిందో నీకు తెల్సునా ! ఓ చచ్చు కథ రాసింది. అది యీ పత్రికలో పడింది యెందరో చదివేస్తారు, యింక దీనికి పెళ్ళి అయే ప్రాప్తి వుందా అంట !"

ఆసలు విషయం ఇప్పటికి అర్థమై అమ్మయ్య యింతే కదూ ! అనుకుని

"కొంపలు అంటుకు పోయినట్లుగా ఈకాస్త కే అంత కేక లెందుకూ".

"పిచ్చి మొఖమా ! అసలది యేం కథ రాసిందో తెల్సునా! కట్నం కావాలన్న అబ్బాయిని అమ్మాయిలు పెళ్ళాడకూడదు ! ఆజన్మ బ్రహ్మచారి ఱులుగా వున్నాసరే ! అంటూ చాలా చెత్త రాసిందే !" అంటూ ఆయన టూకీగా కథ అంతా చెప్పేశాడు. సుబ్బమ్మ మురిసిపోతూ వింది.

"మంచిగానే రాసిందిగా ! ఇద్దరాడపిల్లల పెళ్ళిచేసి బంగారంలాంటి పొలం రెండెకరాలూ మనం అమ్మకోలా ! ఇంక దీని పెళ్ళికి యీ యిల్లు కూడా 'గోవిందో హరి !' అంటుంది. అప్పుడు మనం ఏ చెట్టుక్రింద కాపురం వుంటాం చెప్పండి. మీరా రిటైర్డ్ బడిపంతులుగారు. ఒక్క పైస నిలపలేదు. అబ్బాయికింకా రెక్కలు రాలేదు. మనలాంటివాళ్ల ఈ

దేశంలో వేలూ లక్షలూ. వాళ్ల కష్టాలు రాసింది తప్పేం వుంది!" సాగ దీసుకుంటూ అంది.

"ఓసి పిచ్చిముఖమా! నీ కూతురు పెళ్లి అయినపిల్ల కాదు. యేం రాసినా కష్టమూ నష్టమూ రాకపోవటానికి! ఈలాంటి కథలు రాస్తే యీ జన్మకి పెళ్లికాదు" భార్య ముఖాన పత్రిక విసిరికొట్టాడు. ఆవిడ చర చరా లోపలికి వెళ్లింది. సుమలత తన గదిలోనించి ఇదంతా వింటూనే వుంది.

తన కథ అచ్చు అయిందా! యే పత్రికలో! యే కథ! ఓహో! ఎంత సంతోషవార్త! అసలు ప్రతిరోజూ పోస్ట్‌మేన్ రంగయ్య వచ్చేవేళకి తనే వీధి వసారాలో వుంటుంది. రంగయ్యకు మరీ మరీ చెప్పిందికూడా

"చూడు నా పేరుతో బరువైన కవర్లు యేవి వచ్చినా నాకు తప్ప మరెవరికీ యివ్వకు. లేకుంటే నీదగ్గరేవుంచు నే తీసుకుంటాను" అని పాపం అతను అక్షరాలా పాటిస్తున్నాడు. యీ విషయం. అయితే ఇవాళ వచ్చిన పత్రిక మూర్తిగారికి ఇవ్వకూడదు అని తెల్సి వుండదు. అయినా పత్రికలో వచ్చిన కథని యెన్నాళ్ళని దాచగలదు.

ఇందుకే తండ్రి కోపంలో గంతులు వేస్తున్నా అలాగే నిల్చుంది. తల్లి రాగానే ఆవిడ చేతిలోని పత్రిక గభాలున లాక్కుని పరుగునవెళ్లి గదితలుపు 'ధాం'మ్మని వేసుకుని గబగబా పేజీలు తిప్పేసి తనపేరూ కథా కథకివేసిన బొమ్మా రెండుసార్లు చూసుకుని ఇంక చదవటంలో మునిగి పోయింది.

అవతలనించి తల్లి పెట్టే శాపనార్థాలు సుమలత చెవుల్లో దూరటం లేదు. మేనత్త పిలుపు విన్పించుకోవటంలేదు. కథ పూర్తిగా చదివి ఇప్పటికి అత్త పిలుపు విని గభాలున తలుపు తెరిచి మీనాక్షమ్మని వాటేసు కుని "అత్తయ్యా నాకు భయంగా వుంది" అంది. బేలగా చూస్తూ.

"నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డం వేస్తాగానీ యేదీ ఆ కథ ఓసారి నన్ను చదవనీయి. మీనాన్నని నే శాంతపరుస్తాలే!" అంటూ పత్రిక అందుకుని చదివేసి.

"నా బంగారుకొండా! యెంత బాగా రాశావే!" అని బుగ్గలు పుణికి ముద్దు పెట్టుకుంది.

"అలా రాస్తే బాగుంటుంది అనిసలహా ఇచ్చిందినువ్వేగా అత్తయ్యా సరే మరోటి రాసేస్తాను" అనేసి తెల్లకాయితాలు ముందేసుకుని కూర్చుంది సుమలత.

"ఇదిగో సుమా! మొన్న పెళ్లిచూపులంటూ వచ్చి నిన్ను చూసి పోయిన బొండాంబాబుని గురించి ఒక కథ రాసిపారేయి. రాచిప్పముఖం వాడూను వాడంటే నాకు వళ్లు మండిపోతోంది. పదివేలు కట్నం కావాలట పాపం." అంటూ మరీ మరీ చెప్పి గది తలుపు దగ్గిరగావేసి వెళ్ళింది. సుమలత కథలు పోస్ట్ చేసేందుకు మీనాక్షి తన డబ్బు ఇస్తూ వుంటుంది. మీనాక్షమ్మ ఇవతలకి వచ్చేసరికి వదినగారు కోపం గిన్నెలమీదా చెంబుల మీదా చూపిస్తోంది చూసి "నువ్వు అవతలకి వెళ్లు నే చేస్తాను" అంటూ దగ్గరకి వచ్చింది.

"నా దగ్గరకి రాకు. అసలు సుమని నువ్వే పాడుచేస్తున్నావుగారాబం చేసి అసలూ నాకు తెలియక అడుగుతా పెళ్ళిగాని పిల్ల ప్రేమకథలు రాస్తే దీనికీ జన్మలో పెళ్ళిరాత వుంటుందా! అంట! యెందరిప్పటికి వచ్చి చూసి పోయారో తెల్సుగా. అయినా బుద్ధి వుండద్దూ!" మండిపడుతూ అంది.

"అన్నయ్య ఇందాక అన్న డైలాగులన్నీ మక్కీకి మక్కీ అప్ప గించేస్తున్నావ్!" అంటూ ఆవిడని నవ్వించేసి 'అమ్మయ్య' అనుకుంది మీనాక్షమ్మ. సుబ్బమ్మ అమాయకంగా చూస్తూ.

"ఇంతకీ మరేం ఫర్వాలేదంటావా ఆడపిల్ల కథలురాస్తే" అంది.

"చూడు వదినా అసలు కథలు గురించి యేకాస్త అయినా తెల్సిన వాడైతే యెగిరి గంతేసి పెళ్లాడతాడు. యెందుకంటే కథా రచయిత్రి అయిన తర్వాత వ్యాసాలు సీరియల్ నవలలు సినిమా కథలు ఇలా రాసుకు పోతూనే వుంటుందిగా"

"అట్టాగా" అంది సుబ్బమ్మ ఆడపడుచు చెప్పింది అంతా సరిగా అర్థంకాకున్నా.

* * *

"సుమలత రచయిత్రా!"

సుమలత చిన్నప్పటి స్నేహితులకిది నచ్చలేదు. "ఆ ఏ పాతకథో కాపీకొట్టి వుంటుంది."

"ఆ రహస్యం కాస్తా కొద్ది రోజుల్లో బయట పడిపోతుంది."

"అసలు ఆఇంట్లో ఇటు మూడు తరాలూ అటు మూడు తరాలూ వెతికినా యెవరూ రచయితలు లేరు. మరి ఈ పిల్ల అయిందంటే యెలా నమ్మటం!"

రకరకాల వ్యాఖ్యానాలూ ప్రారంభమయాయి. ఎవరు ఎలా అనుకున్నా సుమలత కథలు అచ్చు అవుతూనే వున్నాయి. మీనాక్షమ్మ అచ్చు అయిన కథలన్నీ చదివి మురిసిపోతూనే వుంది.

ఒకసారి సుమలత లైబ్రరీనుంచి పుస్తకాలు తెచ్చుకుంటూ వుంది. దారిలో లెక్చరర్ మధుసూధన్ కన్పించాడు. "నమస్కారం మాస్టారూ" అంది పుస్తకాలు పట్టుకునే.

"ఓ సుమలతా బాగున్నావా! అన్నట్లు ఈ మధ్య వచ్చిన నీ కథ బాగానే వుంది. కథ పేరు...." ఆలోచిస్తున్న మధుసూధన్ అచ్చంగా తన కథల్లోని హీరోలాగానే కన్పిస్తున్నాడీ క్షణంలో. మధుసూధన్‌కి పాతి కేళ్లు దాటలేదు. అందంగా హుషారుగా నవ్వుతూ వుంటాడని సుమలతకీ ఆయన అంటే చాలా గౌరవం. ఇతను ఇదివరకెన్నడూ తన కథ చదివి నట్టుగా చెప్పలేదు. ఒకటి రెండుసార్లు తన కథ పడిన పత్రిక అతని చేతిలో చూసినా అడగలేదు. సంకోచం భయం సిగ్గూ ఇలా యెన్నో ఆ అమ్మాయిని ప్రశ్నించనీయలేదు.

మధుసూధన్ మళ్ళీ అన్నాడు. "నువ్వే కథ రాయాలన్నా ప్రతి విషయం సహజత్వానికి దగ్గరగా ఆచరణ యోగ్యంగా వుండేలా రాయ టానికి ప్రయత్నించు. నీ కథ చదివి యే ఒక్కరైనా కాస్త ఆలోచించ గల్గితే చాలు"

ఇంకా అతను ఏదో చెప్పబోతూండగానే అతని స్నేహితుడు రావ టంతో వెళ్ళిపోయాడు. సుమలత ఆలోచిస్తూనే ఇల్లు చేరింది.

పెళ్ళి చూపులమీదా వరకట్న పిశాచిమీదా చాలా కథలే రాసింది సుమలత. ప్రేమ కథలూ ఆకలి కథలూ నిరుద్యోగి కథలూ యిలా పత్రికల్లో అచ్చు అవుతూనే వున్నాయి. స్నేహితులు కొందరు 'నీ కథ బావుందని' అంటే మరికొందరు 'చదివాం' అని వూరుకుంటారు. వీటిని అస్సలు పట్టించుకోదుగానీ పాఠకులు విమర్శిస్తూ రాసిన ఉత్తరాలు మాత్రం చాలాసార్లు చదివి ఆలోచిస్తూ వుంటుంది.

* * *

పెళ్ళిచూపులకి సుమలత కివాళ పెళ్ళికొడుకు వస్తున్నాడు. పెళ్ళిళ్ల పేరయ్య ఎంతో కష్టపడి ఈ సంబంధం వాళ్లని పట్టుకొచ్చాడు.

ఇంక ఇంట్లో సుబ్బమ్మ, మీనాక్షమ్మ హడావుడి చెప్పశక్యం కాకుండా వుంది. సుమలత తండ్రికి ముందే చెప్పింది.

"కట్నం తీసుకునే పెళ్ళికొడుకుని నేను చేసుకోను" అని.

"అసలు వాళ్లు అడగనే లేదులే" అంటూ శాంతపర్చాడు మూర్తి. ఇంక పెళ్ళికొడుకు రానే వచ్చాడు. అంత అందంగా లేకున్నా "ఫర్లేదులే" అనుకుంది మనసులో. వుద్యోగం మంచిదే! చదువుంది! అనుకుంది. పెళ్ళికొడుకుతో అతని అక్కా బావా కూడా వచ్చారు పెళ్ళికొడుక్కి వళ్ళంతా చెమట పట్టేస్తోంది. చేతిగుడ్డతో తుడుచుకుంటున్నాడు.

సుమలత అతన్ని ఓసారి పరీక్షగా చూసింది. అతను కొన్ని ప్రశ్నలు వేశాడు. క్లుప్తంగా జవాబిచ్చింది. తను ముందుగా తయారు చేసి వుంచుకున్న ప్రశ్నలపత్రం కోసం యెంత వెదికినా కనిపించక లోలోపల మేనత్తమీద కోపగించుకుంది. ఇది అత్తయ్య పనే. ఎక్కడో దాచేసింది. ఆ ప్రశ్నలన్నీ యీ అబ్బాయిని అడిగితే యీ జన్మకి పెళ్ళి కాదని భయం. అయినా ఆ ప్రశ్నల్లో గుర్తువున్నంతవరకూ అడగాలని ప్రయత్నిస్తూన్న కూతురిని

"సుమా! ఇంక లోపలికివెళ్ళి కాఫీ పంపమని చెప్పు" అనేశాడు తండ్రి.

సుమలత కోపాన్ని మింగుకుని లోపలికి వెళ్ళింది. "యేం ఆడ పిల్లలు ప్రశ్నించకూడదా!" అనుకుంటూ.

ఇంక మీనాక్షమ్మ పెళ్లికొడుక్కి ఫలహారం పెట్టి

"మా సుమలత కథా రచయిత్రి అని ఒకటికి పదిసార్లు చెప్పింది. అతను అదేం పట్టించుకోకుండానే పళ్లెంలో పకోడీలూ తినేసి కాఫీ తాగి వెళ్ళిపోతూ "పేరయ్యగార్ని పంపండి'' అన్నాడు.

ఆలస్యం అమృతం విషం అంటూ పేరయ్య పెళ్ళికొడుకుగారి వూరికి ళ్ళాడు. కానీ మీనాక్షమ్మ గుండె దడగా వుంది. ఆయన యే వార్త తెస్తాడో! అని ఇంక మూర్తిగారూ ఏడుకొండలవాడికి నీవేదిక్కు యీ సంబంధం అయినా అయేలా చూడు అంటూ ఆయనకు లంచాలు పెడుతున్నాడు.

* * * *

పేరయ్య యెండలోపడి వచ్చాడు. మీనాక్షమ్మ అందించిన చల్లని నీళ్ళు తాగేశాడు. వుస్సురంటూ నిట్టూర్చాడు.

"ఏమైంది!" "ఏమన్నారు?"

సుబ్బమ్మ, మూర్తిగారు యేక కంఠంతో అడిగారు.

"పిల్ల నచ్చిందట. కానీ ఈ సంబంధం వద్దుట?"

'ఆఁ! యెందుకుటా?'' నీరసంగా అడిగారు భార్యాభర్తలు.

"వాళ్ళకి ఏంపోయేకాలం వచ్చింది. వాళ్ళు అడిగినవన్నీ 'ఇస్తాం' అన్నాంగా'! మీనాక్షమ్మ కోపంగా అంది.

"పెళ్ళికొడుకు తల్లి నన్ను నాలుగు దులిపేసింది. ఆ పిల్ల కథలూ కాకరకాయలూ రాస్తుందనీ ముందే ఎందుకు చెప్పి ఏడ్వలేదు నువ్వు. చూస్తూ చూస్తూ యెవరైనా కొరివితో తల గోక్కుంటారా! ఉన్నవీ లేనివీ కల్పించి కథలు అల్లే రచయిత్రి కోడలు మాక్కు అక్కరలేదు. మా ఇంటివిషయాలే కథలుగా రాసి మా పరువు బజారు కెక్కించినా చేయగలి గేదేంవుంది. ఆ మీనాక్షమ్మ కడుపు చల్లగా మేనకోడలు రచయిత్రి అని ముందేచెప్పి మమ్మల్ని రక్షించింది. మీకూ మీ సంబంధానికీ ఓ నమస్కారం వెళ్ళు. మా అబ్బాయి అసలే నోరులేని వెధవ." అంటూ నామీద విరుచుకుపడింది పెళ్ళికొడుకు తల్లిగారు.

మీనాక్షమ్మ కిక్కురుమనకుండా అక్కడనుంచి వెళ్ళిపోయింది. 'అయ్యో' అనుకుంటూ సుమలత తన గదిలో కూర్చుని గోళ్ళు కొరుక్కుంటూ యిదంతా వింటూనే వుంది. ఇంక మూర్తిగారు యిల్లు ఎగిరిపోయేలా అరుస్తూన్నారు.

పేరయ్య ఆయన్ని శాంతింపజేసి వెళ్ళిపోతూ.

"మూర్తిగారూ...యెందరాడపిల్లలకో సంబంధాలు కుదిర్చాను. కానీ మీ అమ్మాయికి నావల్ల కాకుండావుంది. నేనింక ఏంచేయలేను''అన్నాడు.

మూర్తిగార్కి దిగులు రోజు రోజుకీ ఎక్కువై పోతోంది. పేరయ్య నావల్లకాదు అనేసరికి.

రోజులు వేగంగా దొర్లిపోతూనేవున్నాయి. రెండు నెలల తర్వాత పేరయ్యాగార్కి ఓ పత్రిక పంపింది సుమలత. అందులో సుమలతరాసిన కథ తనకి "అంకితం" అని చదువుకున్న పేరయ్య సంతోషంతో పొంగిపోయి తన పేరుని పదేపదే చదువుకుని తెల్సిన వాళ్ళకి చూపిస్తూ మళ్ళీ పెళ్ళికొడుకుల కోసం వేట మొదలుపెట్టాడు.

ఓ గుమాస్తా కుర్రాడు దొరికాడు. అతన్ని ఎంతో జాగ్రత్తగా తీసుకువచ్చాడు. బస్ దిగి మూర్తిగారింటికి వెళ్ళటానికి జట్కా యెక్కబోతూండగా పెళ్ళికొడుక్కి నాలుగోక్లాసు చదివినప్పుడు ఫ్రెండ్ అయిన సీతయ్య కనిపించాడు. "యేమిటీవూరు వచ్చావ్!" అంటూ ప్రశ్నలు వేసి విషయం తెల్సుకుని ఫకాలున నవ్వుతూ.

"ఓ రచయిత్రిని పెళ్ళి చూపులు చూడ్డానికి వచ్చావా? ఆ పిల్ల ఇప్పటికి చాలా ప్రేమ కథలు రాసిందిలే. వెళ్ళు వెళ్ళిచూడు" అన్నాడు.

"అంటే" పెళ్ళికొడుకు స్నేహితుడిని నిలదీశాడు.

"అబ్బె మరేంలేదు. ప్రేమ కథలు రాయటమంటే మాటలా! కాస్తో

చూస్తో స్వానుభవం లేకుండా రాయగలరా అని! అయినా నే చెప్పింది నీ విషయంలో కాదు వెళ్ళిచూడు."

పేరయ్యకి యిప్పటికే గుండె దడదడమంటోంది. "జట్కా ఎక్క మని" త్వరపెట్టేస్తున్నాడు. ఎందుకైనా మంచిదని ఓచేత్తో అతన్ని పట్టు కునే-అతను చెయ్యి గుంజుకుని "చూడండి పేరయ్యగారూ! నేను అతి సామాన్యుడిని. రచయిత్రీ! అభినేత్రీ యిలాంటి పిల్లలు నాకొద్దు బాబో! నన్నిలా బ్రతకనీయి" అనేసి దిగిన బస్సే ఎక్కేశాడా పెళ్ళికొడుకు.

* * *

ఈసారి పెరయ్య చాలా జాగ్రత్తగా వ్యవహరించి పెళ్ళిచూపుల తతంగం కానిచ్చేశాడు. సుమలత గుణగణాలు తెగ పొగిడాడు. మీనా క్షమ్మ నోరు మెదపలేదు. అబ్బాయి బాగున్నాడు. ఉద్యోగం చిన్నదే అవనీ అని మూర్తిగారు తృప్తిపడ్డారు. ఇంక సుమలత తన ప్రశ్నలకి కొన్నింటికి జవాబులు చెప్పించి తృప్తి పడింది.

"అమ్మాయి నచ్చింది" అనటం తడవుగా పెళ్ళి లగ్నాలు పెట్టిం చేశాడు పేరయ్య.

పెళ్ళి ప్రయత్నాలు జోరుగా సాగుతూన్నాయి. మూర్తిగారు ఉన్న ఇల్లు అమ్మి ఆ డబ్బుతో ఈ పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నారు. పిల్లపెళ్ళి అవుతూంది అని ఒక ప్రక్క సంతోషిస్తున్నా తర్వాత తలదాచుకోను 'నీడ ఎలా' అని దిగులు పడుతూవుంది సామాన్య గృహిణి అయిన సుబ్బమ్మ.

రచయిత్రి కుమారి సుమలతకి పెళ్ళి అన్న వార్త తెల్సిన పాఠ కులు వరుడు 'ఇంద్రుడా! చంద్రుడా!" అంటూ అబ్బాయిలు అందమైన ఆడపేర్లతో వుత్తరాలు వురికిస్తూంటే యింక అమ్మాయిలు "వరుడు ధర్మేంద్రా! లేక అమితాబచ్చన్‌లా ఉంటాడా!" అని ప్రశ్నిస్తూన్నారు.

ఈ ఉత్తరాలన్నీ చూసుకొని నిర్లిప్తంగా నవ్వుకుంది సుమలత. వెలిసిపోయిన తన వాయిల్ చీరెవైపు చూసుకుంటూ పిచ్చిపాఠకులు ఏదేదో వూహించేస్తూంటారు అనుకుంది.

అభిమాన పాఠకులు కొందరు మీ పెళ్ళికి వస్తూన్నాం. చూడాలని వుంది అనికూడా రాశారు.

"అబ్బా! వీళ్ళెందుకూ" విసుగ్గా అనుకుంది. కానీ మీనాక్షమ్మ మాత్రం "ఏంఫర్వాలేదు రానివ్వు. వాళ్ళ ఆదరసత్కారాలు నే చూస్తాగా నీకేందుకూ" అని ధైర్యం చెప్పింది.

ఇంక సుబ్బమ్మని అల్లుడికి కట్నం యెంత అని అడిగినవారికి "నయాపైసా కట్నంలేదు" అంటూ పెద్ద గొంతుతో చెప్పటం సుమలత చాలాసార్లు వింది. తృప్తి సంతోషంతో మనస్సు నిండిపోగా నే నెంత అదృష్టవంతురాలినీ" అనుకుంది.

* * *

సుమలతని పెళ్ళికూతుర్ని చేశారు. ఆ అలంకరణలో వున్న మేన కోడలు నమస్కరిస్తుంటే మీనాక్షమ్మ సంతోషంతో వుక్కిరి బిక్కిరైంది.

"నిన్నేమని ఆశీర్వదించాలి. కథా రచయిత్రి నవలా రచయిత్రివై సినిమా రచయిత్రివై పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోమ్మా" అంటూ అక్కున చేర్చుకుంది.

"అబ్బ! అత్తయ్యా యెంత ఆశవుంది నీకు" అంది సుమలత.

"అవును నావన్నీ ఆశలే. నే కోరినవన్నీ నీకా భగవంతుడిస్తే నాకింకేమీవద్దు సుమా! ఈరోజుకోసం యెన్నాళ్ళుగానో యెదురుచూశాను. ఆలశ్యంగానయినా వచ్చిందీరోజు అంతేచాలు" తృప్తిగా నిట్టూర్చింది మీనాక్షమ్మ.

"పెళ్ళివారొచ్చారు విడిది చూపాలి" అన్న కేక విని పెళ్ళిపందిరిలో నిల్చుని జరిగిపోయిన విషయాలన్నీ తన కళ్ళముందు అప్పుడే జరిగినట్లు అన్పించి నిలబడిపోయిన మీనాక్షమ్మ వులిక్కిపడింది. "మీనాక్షీ" అన్న అన్నగారి పిలుపుకి లోపలికి పరుగుతీసింది.

పిలకతాతయ్య గొడుగు పుచ్చుకుని తనని వెక్కిరించిన కుర్రాళ్ల కోసం యింకా వెతుకుతూనే ఉన్నాడు.

పెళ్లివారికి విడిదిలో మర్యాదలన్నీ జాగ్రత్తగా చూస్తున్నారు. అవతల లగ్నానికి టైము దగ్గరపడుతోంది అని పేరయ్య పెద్దగా అరుస్తూన్నాడు. ఇంతలో పెళ్లికొడుకు తరుపువారి పెద్దలు 'యేడీ పిల్ల తండ్రి' అంటూ వచ్చారు యిద్దరు. మూర్తిగారు ముందుకి వచ్చారు.

"కాఫీలు కావాలా! ఫలహారాలు కావాలా" అంటూ.

"అవేం వద్దుగానీ రచయిత్రికి మొగుడు కాబోతున్న నీ అల్లుడికి అలకపాన్పు మీద స్కూటర్ కావాలట. యెందుకైనా మంచిదని అడ్వాన్సుగా నీచెవిన వేస్తున్నాం" అనేశారు వచ్చినపని అయినట్లుగా. మూర్తిగారి నెత్తిన పిడుగు పడినట్లే అయింది. నోరెండిపోయింది.

"నావల్లకానిపని" ఖచ్చితంగా చెప్పేశారు. యెలాగో ప్రాణంకూడదీసుకుని.

"అలా అంటే ఎలా! యివ్వటం మీకు మర్యాద! తీసుకోవటం మా మర్యాద" అన్నారు అబ్బాయి తరపువారు.

"ఇవ్వలేను" అక్షరం అక్షరం వత్తిపల్కారు మూర్తిగారు.

"ఇవ్వలేను అని అన్నిసార్లు అనకపోతే ఆ పిల్ల కథలురాసి సంపాదించిన డబ్బుతోనైనా యివ్వచ్చుకదండీ" అనేసరికి మూర్తిగార్కి వళ్ళు మండిపోయింది.

"దీని కథలు తగలడా! ముప్పై కథలు రాసినా పట్టుమని పది కథలకన్నా డబ్బురాలేదు. ఆ వచ్చింది కాస్తా కాగితాలకీ పోస్ట్ చార్జీలకీ పాఠకుల ఉత్తరాలకి జవాబులకి చాలలేదు. యింక స్కూటర్ ఎలా కొనను."

ఆయన నెత్తీ నోరు కొట్టుకున్నారు. ఇరువైపుల చుట్టాలు సమాలోచనలు చేశారు 'రాజీ' అంటూ "యిప్పుడు కాకున్నా తర్వాత స్కూటర్ ఇచ్చితీరాలి" అని.

"లాభంలేదు. నీడ యిచ్చే ఈ ఇల్లు అమ్మి అయిదువేలు కట్నం పోశాను. మిగతాది పెళ్లి ఖర్చులకే చాలదు. స్కూటర్ కాదు సైకిల్ కూడా యివ్వలేను."

ఇప్పటికి 'సరే' అని తల వూగించి. ఆ మూడు ముళ్లు పడింతర్వాత నువ్వు స్కూటరూ యివ్వద్దు సూడిదలూ ఇవ్వద్దు" అని ఒకాయన సలహా యిచ్చాడు.

"అలాటి పనులు అసలు నావల్లకావు" మూర్తి ఖచ్చితంగా అన్నారు.

సుమలత యిదంతా వింటూనేవుంది. ఏమిటీ! కట్నం అయిదువేలు ఇస్తామన్నారా నాకు తెలియదే? 'అత్తయ్యా' గావుకేక పెట్టింది సుమలత.

మీనాక్షమ్మ దూరంనించే సుమలత ముఖం చూసి క్షణంవణికింది.

"అత్తయ్యా నువ్వూ నన్ను మోసగించావా! చెప్పు యిలా ఎందుకు చేశావ్!"

"అయిదువేలంటే అదో కట్నంకింద రాదమ్మా. వాళ్ల ఖర్చులకే రావు. నువ్వీ సమయంలో మాట్లాడకు సుమా'' మీనాక్షమ్మ బ్రతిమిలాడింది. సుమలత ఇదేం వినిపించుకోటంలేదు.

చుట్టాలంతా పెళ్లి పందిరిలో గుమిగూడారు. మీనాక్షమ్మ గుండె గుబగుబలాడుతోంది. ఈ పెళ్ళి కాస్తా ఆగిపోదుకదా! అని. మూర్తిగారికి బంధువులు ఏదో నచ్చచెప్పి లేవదీశారు. "పదండి పానకంకావిడి పట్టు కెడదాం" అని.

సుమలత చరచరా అక్కడికి వచ్చింది. "నాన్నా! ఆగండి. ఈ పెళ్ళి నేను చేసుకోను. పెళ్ళి చూపులనాడే నేనుచెప్పాను. కట్నం యివ్వం అని. అయినా అప్పుడు వప్పుకున్నట్లుగా నటించి మీరు చాటు చాటుగా యిచ్చిన అయిదువేలూ తీసుకోవటం ఇంకా ఇప్పుడు అలకపాన్పుమీద స్కూటర్ కావాలంటూ బేరాలుసాగించే అతన్ని నేనుచచ్చినా పెళ్ళిచేసుకోను'' సుమలత ముఖం యెర్రబడింది అప్పుడే.

'అయ్యో!' అంటూ మూర్తిగారు కూతుర్ని పక్కగదిలోకి తీసుకు వెళ్ళి నయానా, భయానా చెప్పారు. మీనాక్షమ్మా తల్లీ బ్రతిమిలాడారు. అయినా వినలేదు సుమలత.

పెళ్ళిపందిరిలో సన్నాయి ఆగిపోయింది. కొందరు బంధువులు విడిదినుంచి ఇక్కడికీ, ఇక్కడినించి అక్కడికీ తిరుగుతూ వార్తలు అంది స్తున్నారు.

ఊరినుంచి వచ్చిన సుమలత పాఠకులు పెళ్ళిటైము అయిందని ముస్తాబుని ముగించుకుని కెమేరాలూ, ప్రజెంటేషన్సూ పట్టుకుని పెళ్ళిపంది రిలోకి వచ్చారు. ఆ వచ్చినవారిలో యిద్దరు అమ్మాయిలూ నలుగురు అబ్బాయిలూనూ. "పెళ్ళికొడుక్కి స్కూటర్ కావాలట! ఇప్పుడు పేచీ పెట్టాడట'' అన్నవార్తవిని "ఆ! రచయిత్రి పెళ్ళికీ ఇలాంటిసమస్యలేనా!' అని విస్తుపోయారు. ఎవరా పెళ్ళికొడుకు? నాలుగు తన్ని లాక్కువచ్చి పెళ్లిపీటలమీద కూలేస్తే సరిపోతుంది'' అమ్మాయి లిద్దరూ ఆవేశపడ్డారు.

'హుష్' అన్నారు అబ్బాయిలు. ఇంక గదిలో సుమలత తల్లి "నీ కిప్పుడు పెళ్లికాకుంటే ఈ జన్మలో కాదే" అంటోంది.

"కాకున్నా ఫర్లేదుగానీ ఈ వ్యక్తిత్వం లేనివాడిని చస్తే చేసుకోను"

మూర్తిగారు కూతురు ముఖంలోకి చూశారు. సుమలత పాఠకులు ఆగదిలోకి వచ్చి ఇదంతా విన్నారు. ఆ అమ్మాయి ధైర్యానికి అచ్చెరువందారు, ఆనందపడ్డారు. "రచయిత్రి సుమలతకీ జై" అందరూ యేక కంఠంతో అరిచారు: మూర్తిగారు వీళ్ళందరినీ వెర్రివాడిలా చూశారు.

"రచయిత్రి సుమలతకీ జై" అని అందరి కంటేముందు నిల్చుని అరుస్తున్న అన్నారావుని షర్టు పట్టుకుని గుంజి అడిగారు.

"నోరుందికదాఅని రచయిత్రికీ జై అని అరుస్తూన్నావు కానీ ఈ పెళ్ళి తప్పిపోతే నాకూతుర్ని నువ్వు పెళ్లిచేసుకుంటావా పెద్దమనిషీ."

అనుకోని ఈ పరిణామానికి అక్కడ అందరూ శిలాప్రతిమల్లా అయ్యారు.

"యేం! చెప్పు! చేయెత్తిజై కొట్టటంకాదు, అవసరం అయితే నువ్వు పెళ్ళాడటానికి ముందుకు వస్తావా! అంట?" మూర్తిగారు రెట్టించి అడిగారు ఆవేశంగా.

అన్నారావు హడలిపోయాడు. అతనిలోని ఆవేశం ఆవిరిలా యెగిరి పోయింది. "నా...నాకు ..యాభైవేలు కట్నంతో పెళ్లి ఖాయం అయింది" అంటూ ఆయన చేతిలోని షర్టు లాక్కుని అందరివెనక్కి జారు కున్నాడు.

మూర్తిగారిలోని ఆవేశం పెరిగిపోతోంది. మిగతావాళ్ళని ఛాలెంజ్ చేస్తున్నట్లు అడిగారు. ఎవ్వరూ కిక్కురుమనలేదు. కానీ లెక్చరర్ మధు సూధన్ అక్కడ జరిగేదంతాచూస్తూ నిల్చున్నవాడల్లా ముందుకువచ్చాడు.

"చూడండి మూర్తిగారూ! మీకూ మీ అమ్మాయికీ అభ్యంతరం లేకుంటే నేనే పెళ్లికి సిద్ధంగా వున్నాను. కట్నకానుకలు అక్కర్లేదు! చెప్పండి. ఏమంటారు."

"మీరు...నా కూతుర్ని కావాలని ముందుకు వస్తున్నారా! పేద వాడినని పరిహాసిస్తున్నారా లేక నిజంగా కావాలనా!" నమ్మలేనట్లుగా అడిగాడు.

"నిజంగానే అడిగాను" దృఢంగా అన్నాడు మధుసూదన్.

"ఈపాపిష్టి ప్రపంచంలో ఇంకా మంచివాళ్ళు వున్నారా!" అని గొణిగే మూర్తి చెవిలో పెద్దలు గుసగుసలాడారు. "ఈ పెళ్లి ఇప్పుడే ఇతనితో కానిచ్చేస్తే సరి!" వాళ్ళని వెళ్లిపొమ్మందాం.

"అసలు పెళ్లికూతురు అభిప్రాయం కనుక్కోండి" అనటంతో మధుసూదన్ సుమలత దగ్గరికి వెళ్ళాడు. సుమలత నీళ్ళు నిండిన కళ్ళతో యెత్తి చూస్తూ

"జాలిపడి ఈ నిర్ణయానికి వచ్చారా మాష్టారూ" అంది.

"కాదు, కానేకాదు" అంటూన్న అతని ముఖంలోకి మళ్ళీ చూసింది. అతను నిశ్చలంగా నిల్చున్నాడు. సుమలత చేతులు జోడించింది.

"అదృష్టవంతురాలిని. కానీ మీ తల్లిదండ్రుల విషయం మర్చి పోయారా"

"సుమలతా! నీలాంటి అర్ధాంగే నాకు కావాలి! నేనిప్పుడే వెళ్లి వాళ్ళతో వస్తాను." అంటూనే అతను వెళ్లిపోయాడు. ఇక్కడ జరిగేదంతా తెల్సిపోయింది. "అయ్యో! స్కూటరూవద్దు పాడూవద్దు పెళ్లి కానివ్వమను" అంటూ కాళ్లబేరానికి వచ్చారు, పెళ్లికి తరలివచ్చి వెనక్కిపోతే పరువు వుంటుందా!" అని బ్రతిమలాడారు.

"లాభంలేదు! నా పిల్లని మీకివ్వను, దయచేసి వెళ్లిరండి" అని మూర్తిగారు గట్టిగా చెప్పేసరికి వాళ్ళు తలలు వంచుకుని వెళ్లిపోయారు.

పేరయ్య గోడగడియారంలోకి చూసి కంగారుపడిపోతూ సుమలత దగ్గరగా వచ్చి మెల్లగా "అతను మూడుముళ్ళు వేసేస్తాను అని ముందుకు వస్తే అవి వేయించుకున్నాక ఆయన అమ్మానాన్న దగ్గరికి పోతేపోలా! వెళ్లిన ఆయన తిరిగి రాకపోతేనో!"

"ఆయన తిరిగి వస్తారు. నాకు నమ్మకం వుంది" శాంతంగా అంది సుమలత.

"నీ ముఖం! జీవితం అంటే బరబరా నాలుగు కథలు గీకటం అనుకున్నావా! శుభశ్య శీఘ్రం అన్నారు పెద్దలు! ఒకందుకుమాత్రం సంతోషంగా వుంది తల్లీ నిన్నుచూస్తే. నీ నిండుబుద్ధికి యెర్రగా బుర్రగా ఉన్న యెనిమిదివందల జీతగాడు పెళ్ళాడుతా అని ముందుకి వచ్చినా విజ్ఞతగా ఆలోచించినావు.

పేరయ్య ఆత్మీయతగా అన్నాడు. పెళ్లిపందిరిలో అందరూ ప్రాణాలు బిగబట్టి వీధివాకిలివైపు చూస్తున్నారు. మధుసూదన్ జాడలేదు. నిమిషాలు యుగాల్లా గడుస్తున్నాయి. ఒకటి రెండుసార్లు స్కూటర్‌శబ్దం అయి వచ్చేశాడన్న కలకలం బయలుదేరి 'కాదు....కాదు' అని నిట్టూర్పులతో నిరీక్షణ ప్రారంభమైంది.

మగపెళ్లివారిని తిరస్కరించామని ఇతను ఆశపెట్టి అవమానం పాలుచేయాలని చేసిన యెత్తు కాదు కదా ఇది! అనే అనుమానం మూర్తిగారితో మొదలై అందరిలోకి పాకింది. సుమలత మాత్రం గౌరీపూజచేస్తూ నిశ్చలంగా కూర్చుని వుంది.

కారు వచ్చిన శబ్దం అయింది. పార్వతీపరమేశ్వరుల్లావున్న వృద్ధులైన తల్లిదండ్రుల వెంట మధుసూదన్ పెళ్ళికొడుకు అలంకరణలో పందిరిలో అడుగుపెట్టాడు.

"పెళ్లికొడుకు వచ్చేశాడు" అనేకేకలుమిన్నుముట్టాయి. సన్నాయి తిరిగి మ్రోగుతోంది పేరయ్య మధుసూదన్‌ని పెళ్ళిపీటలమీద కూర్చో బెట్టారు. మధుసూధన్ తల్లిదండ్రులకి సుమలత నమస్కరించింది. ఆవిడ సుమలతని ప్రేమగా లేవనెత్తి "మా అబ్బాయిలు ముగ్గురికీ కోడళ్ళని నేనే వెతుక్కున్నాను. కానీ ఈ నాలుగోవాడు యివాళ హడావుడిగా వచ్చి "నీ కోడల్ని చూసివచ్చానమ్మా" అన్నాడు అంటూ నవ్వింది.

"పెళ్లికూతుర్ని తీసుకురావాలి" పేరయ్య గొంతు పెద్దగా విన్పిస్తోంది.

"సన్నాయి గట్టిగా వాయించండి. ఇంకా ఇంకా గట్టిగా."

మంగళవాయిద్యాలమధ్య మధుసూదన్ సుమలత మెడలో మూడు ముళ్ళు వేసేశాడు. సుమలత పాఠకులు ఆనందంతో వుక్కిరిబిక్కిరి అవుతూ...

"రచయిత్రికీ జై" అన్నారు పెద్దగొంతులతో. అదివిన్న మూర్తి గారు ఆనందం పట్టలేక ఆవేశంతో కూతుర్ని చూసుకుంటూ పిసరంత గర్వంతో సుమలత పాఠకుల గొంతులో గొంతుకల్పి...

"తెలుగు రచయిత్రికీ జై" అన్నారు. అన్నికంఠాలూ ఏకమై ఏక కంఠంలా విన్పిస్తోంది. "తెలుగు రచయిత్రికీ జై" అక్షింతల వర్షం కురుస్తోంది.

*